
# వర్షించని మేఘం

వెన్నెల



ఆఫీసు నుంచి వచ్చి కాఫీ త్రాగుతూ బాల్కనీలో నిలబడ్డాను. సాయంకాలం ఐదు గంటలవుతోంది. ఊరికి కొంచెం దూరంగా కొత్తగా కడుతున్న కాలనీలో అక్కడక్కడా మాత్రమే ఇళ్లు కనిపిస్తున్నాయి. కూలీ పనికొచ్చిన జనం వేసుకున్న పూరి గుడిసెలే ఎక్కువగా వున్నాయి. కాఫీ త్రాగడం అయిపోయింది. గ్లాసు పక్కన పెట్టాను. ఎందుకో లోపలకి వెళ్ల బుద్ధి కాలేదు.

దూరంగా ఖాళీ స్థలంలో ఆ పూరిగుడిసెల ముందు ఆడుకుంటున్న పిల్లల కేరింతలు గాలిలో తేలి వస్తూ నా చెవులను తాకుతున్నాయి. ఏ చీకూ చింత లేకుండా ఆడుకుంటున్న వాళ్లని చూస్తే నాకు నా చిన్నతనం గుర్తుకు వచ్చింది. ఎంత మధురమైనది ఆ బాల్యం !

ఆ పసితనంలో నా చిన్ని మనసులో ఎన్నో ఊహలు అనంతాంబరాన్ని అందుకోవాలని, పక్షిలా హాయిగా నీలాల నింగిలో ఎగరాలనీ, వెండిమబ్బుల  పరుపుపై పవళించాలని, చందమామతో దోబూచులాడాలని, చుక్కలతో ఊసులాడాలని ఎన్నెన్నో ఆశలు, అవన్నీ అమ్మతో చెబితే నా బుగ్గ మీద చిటికె వేసి మురిపెంగా నవ్వేది.

అమ్మ ఒడిలాంటి మా పల్లెలో, ఆ కొబ్బరి తోటల్లో, ఏటి గట్ల మీద, కోవెల మెట్ల మీద, రామయ్య మాష్టారు చెప్పే పాఠాలతో ప్రియనేస్తాల ముచ్చ

ట్లతో, ఆటపాటల్లో ఎలా గడిచాయో పద్దెనిమిదేళ్లు తెలియనే తెలియదు. 'ఒంటి మీదకు పద్దెనిమిదేళ్లు వచ్చాయి. ఆడపిల్లకు పెళ్లి చేయకుండా ఇంకా ఎంత దాకా చదివిస్తావు?' అనే నాయనమ్మ సణుగుడుతో నాన్నకు తన పెళ్లి తలపెట్టక తప్పింది కాదు. తనకు బాగా గుర్తు ! అప్పుడే పెళ్లి వద్దనీ, ఇంకా చదువు కుంటానని ఏడ్చింది తను 'ఊరుకోరా మిన్నూ, మా అమ్మవు కదా? పెళ్లయ్యాక కూడా చదువుకుంటా నన్నావని ఆ అబ్బాయితో చెబుతాలే. అతనికి కూడా చదువంటే ఇష్టమేగా, కాదనడు. అబ్బాయి మంచి వాడు, ఒప్పుకోమ్మా' అని నాన్న తనకు నచ్చచె ప్పారు. తన పేరు యామిని. తనంటే నాన్నకు చాలా ఇష్టం. ముద్దుగా తను 'మిన్నూ' అని పిలిచేవారు. నాన్న మాట కాదనలేకపోయింది తను.

దాంతో సుధాకర్‌తో తన పెళ్లి జరిగిపోయింది. అతను ఇచ్చిన మాట ప్రకారం డిగ్రీ పరీక్షలకు చదివించి వ్రాయించాడు. తనలో ఏమూలో వున్న అసంతృప్తి కాస్తా తొలగిపోయింది. 'చదువు అయిపోయింది. కొంతకాలం ఎక్కడికైనా సరదాగా వెళ్లి రండి' అని నాన్న అంటే, 'మామయ్యా! ఈ పల్లె కంటే వేరే స్వర్గం ఎక్కడ వుంటుంది? చెప్పండి' అన్నాడు సుధాకర్.

పిల్ల తెమ్మెరలు వీస్తుంటే, ఎల మావి గుబురులో నుండి కోయిల కూస్తుంటే వింటూ, ఏటిగట్టు మీద కూర్చుని సాయంత్రం వేళ ఎన్నో కబుర్లు చెప్పుకునేవారు. అప్పడప్పుడూ చిటపటమంటూ పడే వాన చినుకులు, నింగిలోని నీలి మబ్బు తునకలు తమని పలకరించి వెళుతుండేవి. గాలిలో తేలి వచ్చే పూల పరిమళాలను ఆస్వాదిస్తూ తేటనీటి ఈ ఏటి ఒడ్డున నాటిన పువ్వుల తోట..' అంటూ కృష్ణశాస్త్రి కవిత్వం చెప్పాలనుందోయ్'' అనేవాడు సుధాకర్ ఉద్వేగంగా. సుధాకర్ సాహితీప్రియుడు. తమ మధ్య సాహిత్య సంబంధమైన చర్చలు కూడా జరిగేవి. సుధాకర్ అధికారం చెలాయించే భర్తలా కాక ఒక మంచి స్నేహితుడిగా వుండేవాడు. తన అభిప్రాయాలకు ఎంతో విలువ ఇచ్చేవాడు.

ఆ రోజు తన పుట్టిన రోజు 'మిన్నూ నీ కోసం ఏం తెచ్చానో చూడు'' అంటూ ఒక గిఫ్ట్ ప్యాక్ తన చేతిలో వుంచి, బల్ల మీద పెట్టి జాగ్రత్తగా తీయమన్నాడు. చాలా ఆత్రుతగా ఆ ప్యాకింగ్ విప్పింది తను. పాలరాతితో చేసిన రాధాకృష్ణుల విగ్రహం. వారి ప్రేమంత స్వచ్ఛంగా వుంది. కన్నులు మూసుకొని తన్మయత్వంతో మురళి వాయిస్తున్న కృష్ణుడు, అతని భుజం మీద తలవాల్చి అరమోడ్పు కన్నులతో ఆ వేణుగానం వింటూ పరవశమవుతున్న రాధ ఎంతో బావుంది. ఆ విగ్రహం. కింది చెక్క మీద

'నా జీవన వనమునకు
వేంచేసిన ఆమని
నా ప్రియ భామిని
యామినికి''

–ప్రేమతో సుధాకర్

అని వ్రాసి వుంది. అది చూసిన తను ఆరోజు పురి విప్పిన మయూరమే అయింది. ''మిన్నూ మీ నాన్న అంత ముక్కువగా పెట్టిన నీ పేరుకు అర్థమేమిటో నీకు తెలుసా అసలు?'' అని అడిగాడొకసారి సుధాకర్. తెలుసు, 'యామిని' అంటే 'రాత్రి' అనేగా అర్థం. అయితేనేం ఆరాత్రిలో వెన్నెలలు కురిపించే సుధాకరుడు మీరున్నారుగా' అంది తను ''అబ్బో ! మాటలు బాగానే నేర్చావే ' అన్నా ఆ మాటలకు ఎంత సంతోషించాడో సుధాకర్ ముఖం చూడగానే తనకు అర్థం అయింది.

తాను బి.ఎ ఫస్ట్ క్లాసులో పాసయ్యానని తెలిసిన రోజు తనకంటే ఎక్కువగా సుధాకరే సంతోషించాడు. మర్నాడు ''యామిని సుధాకర్ బి.ఎ'' అన్న నేమ్ ప్లేటు చెక్కించి తీసుకుని వచ్చాడు. అది చూసి తనెంతో మురిసిపోయింది. పెళ్లయిన రెండేళ్లకు పాప పుట్టింది. పాపకు ''సౌదామిని'' అన్న పేరును సుధాకరే పెట్టాడు. 'యామినిని వెన్నెల వెలుగులతో నింపే సుధాకరుడే కాదు, మెరుపుల జిలుగులతో మురిపించే 'సౌదామిని' కూడా వచ్చిందోయ్'' అన్నాడు హాస్యంగా. పాపాయి బోసి నవ్వులతో, ముద్దు మాటలతో, తప్పటడుగులతో ఒక ఏడాది గిర్రున తిరిగింది. తన జీవితంలో ఆ మూడేళ్లు ఎంతో అమూల్యమైనవి. తన జీవితంలో ఇక వెన్నెల వెలుగులు, మెరుపుల తళుకులే అని మురిసిపోతున్న తనకు వాటిని కబళించడానికి రాహువు మృత్యురూపంలో వస్తోందని తెలియదు.

'నా జీవన
వనమునకు
వేంచేసిన
ఆమని
నా ప్రియ
భామిని
యామినికి''

– ప్రేమతో
సుధాకర్

ఆరోజు తన జీవితంలో చాలా భయంకరమైన రోజు. సుఖం, శాంతి, ఆనందం, నిశ్చింత అనే పదాలు తన జీవిత నిఘంటువులోంచి చెరిగిపోయిన రోజు. తలుపు చప్పుడైతే గబగబా వెళ్లి తీసిన తనకు కనిపించిన దృశ్యం ఎంత దారుణమైనది ! నలుగురు మనుషుల చేతుల్లో నిర్జీవంగా రక్తసిక్తమైన దేహంతో సుధాకర్. వాళ్లేదో చెబుతున్నారు. ఇంకేదేదో అడుగుతున్నారు. తనకేం వినిపించం లేదు. కొయ్యబారిపోయినట్లు అయిపోయింది తను. కబురు తెలిసిన అమ్మానాన్నా వెంటనే ఊరి నుంచి వచ్చారు. గుండెలవిసేలా ఏడ్చారు. తనలో చలనం లేదు. కళ్లమ్మట నీళ్లు కూడా రావడం లేదు. వీళ్లంతా ఇలా ఏడుస్తున్నారేమిటి? సుధాకర్ చనిపోయాడని అంటారేమిటి? ఆ నిజాన్ని తన మనసు నమ్మడం లేదే ! బంధువులది చూసి, 'అమ్మాయి బాగా షాక్ తిన్నట్లుంది. అలాగే వుంటే ప్రమాదం. ఒక్కసారి ఏడిస్తే గుండెల్లో బాధ తగ్గుతుంది. ఎలాగైనా ఏడ్చేటట్లు చేయండి' అని సలహా ఇచ్చారు. తన కళ్లలో నలక పడి నీళ్లొస్తేనే చూసి భరించలేని అమ్మానాన్నా తనను ఏడ్పించడం కోసం నరకయాతన పడ్డారు. చివరకు తననీ, సౌదాని ఊరికి తీసుకుని వెళ్లిపోయారు. ఆ పల్లె వాతావరణం సుధాకర్‌ని ఎంతగానో గుర్తుకు తెచ్చేది. ఏటి గట్టు మీద కూర్చుని ఇంకా సుధాకర్ కబుర్లు చెబుతున్నట్లుగానే వుండేది.

ఒక్కసారి...
నాకోసం... మళ్లీ ఒక్కసారి
జీవించి తిరిగిరా ప్రియతమా !
ఏటిగట్టూ...మావి చెట్టూ...
కోకిలమ్మ కులుకూ, జాబిలమ్మ వెలుగు
నీలి మబ్బు తునక, స్వాతి వాన చినుకూ
మళ్లీ మనలను జంటగా చూడాలని
నిరీక్షిస్తున్నాయి అందుకే
ఒక్కసారి మళ్లీ నాకోసం
జీవించు ప్రియతమా !

అని తన మనసు మూగగా రోదించేది. ''నా న్నాలు ఎప్పుడొస్తాలు'' అని ముద్దు ముద్దుగా అడిగే సౌదాకేమని చెప్పాలో తెలియక గుండె నీరయ్యేది. ఒక్కగానొక్క కూతురి బ్రతుకు పాతికేళ్లన్నా నిండకుండానే ఇలా అయిపోయిందే! అనే దిగులుతో కృశించి ఒకరి తర్వాత ఒకరుగా అమ్మానాన్నలు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. ఇంక ఆ పల్లెలో వుండలేక గుండెరాయి చేసుకొని సౌదాను తీసుకొని తను పట్టణానికి వచ్చేసింది. డ్యూటీలో వుండగా పోవడంతో సుధాకర్ ఉద్యోగం తనకు వచ్చింది. అప్పటి నుండి సౌదాను పెట్టుకొని ఇలా ఒంటరిగా తను..

అలా ఎంత సేపు నిలబడ్డానో ! దట్టమైన మబ్బులు ముసురుకొని ఆకాశం నల్లగా అవుతోంది. సాయంత్రం రాత్రిగా మారబోతున్న వేళ, ఎందుకో మనసంతా దిగులుగా వుంది. ఒంటరితనమనే నల్లటి రాక్షసి తనను మింగడానికి వస్తున్నట్లుగా వుంది. మనసంతా భయం. నరనరాన నిస్సత్తువ. ఈ ఒంటరి తనంతో పదిహేనేళ్ల నుండి తాను పోరాడుతూనే వుంది. ఆఫీసులో లేని పనులన్నీ కల్పించుకొని, ఎంతగా నలుగురిలో కలిసి తిరిగినా, ఇంటికి వచ్చాక ఒంటరి తనం పీడుస్తూనే వుంటుంది. 'మనసున మనసై, బ్రతుకున బ్రతుకై, తోడొకరుండిన అదే భాగ్యము' అని శ్రీశ్రీ ఇందుకే వ్రాసాడేమో ! ఇంకా ఎన్నేళ్లు ఈ జీవితాన్ని గడపాలి? నిస్సారమైన ఈ బ్రతుకింక చాలు. ఈ బాల్కనీలో నుండి దూకేస్తేనో?

''అమ్మా ! నాకు మా స్కూలు మొత్తం మీద ఫస్టు ర్యాంకు వచ్చింది. ఇలాగే పట్టుదలగా చదివితే ఫైనల్ ఎగ్జామ్స్‌లో కూడా మంచి టోటల్ వస్తుందని, మంచి కోర్సులో సీటు వస్తుందని మా టీచరు చెప్పారు'' ముఖమంతా సంతోషం నిండిపోగా చేతిలో ప్రోగ్రెస్ రిపోర్టుతో వస్తూ చెబుతున్న సౌదాను చూస్తూనే ఒక్కసారి ఉలిక్కిపడ్డాను. సంబరంగా నా చేతులు పట్టుకొని ఊపేస్తూ ఏదేదో చెబుతోంది సౌదా... నాకవేవీ వినిపించడం లేదు. దాని కళ్లల్లో వెలుగే కనిపిస్తోంది. ఒక్క క్షణం క్రితం తనకెంత భయంకరమైన ఆలోచన వచ్చింది ! సౌదా రాకపోతే తనపానే చేసేదేమో! తలచుకుంటేనే ఒళ్లు గగుర్పొడిచింది. అప్పుడు అమ్మ కూడా లేపకుండా అనాధలాగా సౌదా... ఇంక ఆలోచించడానికే మనసు అంగీకరించడం లేదు. జీవితమంటే తనకు ఎంత విరక్తి కలిగినా, సౌదా కళ్లల్లో ఈ వెలుగు చూడాలంటే తను బ్రతికి తీరాలి.

ఆకాశంలో వర్షించకుండా దూరంగా వెళ్లిపోతున్న నల్లటి మేఘాన్ని చూసాను. ఆ వర్షించని మేఘాన్ని నేనయితే, సుధాకర్ చెప్పినట్లు, నా దుఃఖమనే చీకటిని చీల్చే మెరుపుతీగ నా పాప 'సౌదామిని'. ఇప్పుడు నా మనసుకెంతో ఊరటగా అనిపిస్తోంది. ఇలా అనుకుంటుంటే....